సాక్షి
నిజామాబాద్
గురువారం । 8 । మే । 2025



పత్తాలేని జీలుగ విత్తనాలు

ఖరీఫ్ సీజన్ దగ్గరికి వచ్చినా జిల్లాకు అవసరమైన జీలుగ విత్తనాలు ఇప్పటి వరకు రాలేవు. రైతులు ఎదురు చూస్తున్నారు.

- 10లో ▸



మాదకద్రవ్యాల..

మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి కృషి చేయాలని కలెక్టర్ హనుమంతు, సీపీ సాయిచైతన్య సూచించారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
40.3 /18.6

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.





సైన్యానికి జేజేలు..

పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఆపరేషన్ సిందూర్ పేరిట భారత ఆర్మీ మంగళవారం అర్ధరాత్రి పాక్, పీవోకేలోని ఉగ్రవాదుల శిబిరాలపై వైమానిక దాడులను విజయవంతంగా నిర్వహించింది. ఈ దాడుల్లో ఉగ్రవాదులు హతమయ్యారు. ఈసందర్భంగా త్రివిధ దళాలకు దేశం మొత్తం సెల్యూట్ చేస్తోంది. ఉగ్రవాదులను మట్టుబెట్టడంపై సరైన నిర్ణయం తీసుకున్నారని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అందరి ఫోన్‌లలో జయహో ఆర్మీ... సెల్యూట్ అంటూ స్టేటస్‌లు పెట్టుకున్నారు. సైన్యం మనల్ని తల ఎత్తుకునేలా చేసిందంటూ పలువురు జిల్లావాసులు సైన్యానికి మద్దతు తెలుపుతూ తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు. - నిజామాబాద్‌నాగారం

ప్రతీకార దాడి అదిరింది

- ఆపరేషన్ సిందూర్.. అభినందనీయం
- జవాన్లకు మద్దతు తెలిపిన జిల్లా ప్రజలు
- దేశ ప్రజలకు గర్వకారణం..
- జయహో ఆర్మీ... సెల్యూట్ అంటూ వాట్సాప్ స్టేటస్‌లు

పక్కా ప్రణాళికతో..




పహల్గాం దాడిలో అమాయకులను పాక్ ఉగ్రవాదులు కాల్చిచంపడం యావత్తు దేశంతోపాటు, ప్రపంచం కూడా నివ్వెరపోయింది. ఉగ్రవాదులను అంతమొందించడానికి ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ సైన్యం పక్కా ప్రణాళికతో ప్రతీకారం తీర్చుకోవడం హర్షణీయం. ప్రపంచదేశాలు సైతం భారత్‌కు అండగా నిలిచాయి. ఎల్లవేళలా ప్రజలు ప్రధాని మోదీకి అండగా ఉంటారు.

- మంచాల జ్ఞానేందర్‌గుప్తా, శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నిజామాబాద్



ఆపరేషన్ సిందూర్ పై హర్షం వ్యక్తం చేస్తూ వాట్సాప్ స్టేటస్‌లు

ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తే ఇలాంటి గతే..



ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తే ఇలాంటి గతే పడుతుంది. అమాయక ప్రజలను కాల్చి చంపిన ఉగ్రవాదులను, సంస్థలను ధ్వంసం చేయడం శుభ పరిణామం. ఈ దెబ్బతో పాక్ ఉగ్రవాదులు తోకముడిచారు. నేను ఆర్మీలో 20 ఏళ్ల పాటు విధులు నిర్వహించారు. 1971లో యుద్ధంలో పాల్గొన్నాను. కార్గిల్‌వార్‌లో కూడా పాల్గొన్నాను.

- మల్లికార్జున్‌రావు, రిటైర్డు ఆర్మీ

ఆర్మీ మంచి జవాబు ఇచ్చింది



పాక్ ఉగ్రవాదులకు మన ఆర్మీ మంచి జవాబు ఇచ్చింది. నేను ఇండియన్ ఎయిర్ ఫోర్సులో 20 ఏళ్లు పనిచేశాను. కార్గిల్ వార్‌లో పాల్గొన్నాను. పాకిస్తాన్ ఏమైనా సమాధాన మిస్తే మరింత దాడులు ఉంటాయి.

- సూద హర్షప్రసాద్, మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు

భారత ఆర్మీకి సెల్యూట్



సరిగ్గా 15 రోజుల తర్వాత సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రధాని మోదీ పాక్ ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి అంతమొందించారు. ఆపరేషన్ సిందూర్ మిస్సైల్స్ సక్సెస్ కావడం దేశ ప్రజలందరికీ గర్వకారణం. ఇందులో మహిళ కమాండర్లు పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. అమాయకుల ప్రాణాలు తీసిన వారు మూల్యం చెల్లించుకున్నారు. ప్రధాని మోదీ సత్తా ఎంటో చూపించారు.

- సరళ మహేందర్‌రెడ్డి, న్యాయవాది, నిజామాబాద్

దేశ శత్రువులకు సరైన సమాధానం



భారత సైన్యం తన సత్తా చాటింది. అమాయకులను చంపిన వారిని సైన్యం దాడి చేసి అంతమొందించడం హర్షణీయం. ప్రధాని మోదీ నేతృత్వంలో ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశ శత్రువులకు తగిన సమాధానం చెప్పారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సైనికులకు మద్దతుగా నిలవాల్సిన సమయం ఇది. జయహో భారత్.. జైహింద్..

- సయ్యద్ ఖైసర్, కాంగ్రెస్ మైనారిటీ నాయకులు, నిజామాబాద్

పాక్‌కు సరైన గుణపాఠం



మరో పహల్గాం ఘటన జరగకుండా పాక్‌కు మన దేశ ఆర్మీ సరైన గుణపాఠం చెప్పింది. ఇండియన్ ఆర్మీ కేవలం ఉగ్రవాద స్థావరాలపైనే దాడి చేసింది. అమాయక ప్రజల జోలికి వెళ్లలేదు. భారత భూభాగంలోకి అడుగుపెట్టి అమాయక పౌరులను కాల్చి చంపిన ఉగ్రవాదులను మట్టుపెట్టేందుకు ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అయ్యింది. సైన్యానికి జేజేలు.

- దయాకర్‌గౌడ్, పీసీసీ రాష్ట్ర లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు, నిజామాబాద్

ప్రతీకారంలోనూ మానవత్వం



భారత ఆర్మీ ప్రతీకారంలోనూ మానవత్వాన్ని చాటింది. అత్యంత కచ్చితత్వంతో ఉగ్రమూకలను నేల కూల్చిందే తప్ప. సామాన్య ప్రజల జోలికి పోలేదు. రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయిల్–హమాస్ యుద్ధాల్లో సైనికులు మంచి చెడులు చూడలేదు. మన సైన్యం మాత్రం యుద్ధంలో మంచి, చెడులు చూసింది. అందుకే మన దేశం అంటే ప్రపంచలోనే ప్రత్యేక గౌరవం ఉంటుందనడానికి ఇదే నిదర్శనం.

- సీహెచ్ వెంకటరమణ, నిజామాబాద్

భారత సైన్యానికి అభినందనలు



పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులపై భారత సైన్యం ప్రదర్శించిన సైనిక పోరాటానికి ఒక భారతీయుడిగా గర్వపడుతున్నాను. ఉగ్రవాదం, ఉన్మాదం ఏ రూపంలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేది తప్ప లాభం చేకూర్చేది కాదు. ప్రపంచ శక్తులన్నీ ఏకమై ఉగ్రవాదాన్ని అంతమొందించాలి. అయితేనే శాంతి సామరస్యాలు నెలకొంటాయి. ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టిన భారత సైన్యానికి అభినందనలు తెలియజేస్తున్నాను.

- వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే

న్యూస్‌రీల్

ఉగ్రవాదం ప్రపంచానికి పెనుముప్పు



నిజామాబాద్ సిటీ: ఉగ్రవాదం ప్రపంచానికి పెనుముప్పు అని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. పహల్గామ్‌లో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బస్వాగార్డెన్ నుంచి పులాంగ్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పులాంగ్ చౌరస్తా వద్ద క్యాండిల్లు వెలిగించి సంఘీభావం తెలిపారు. పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసి విజయవంతంగా తిరిగివచ్చిన జవాన్లకు సెల్యూట్ చేశారు. విపత్కర సమయంలో పార్టీలకు అతీతంగా అందరూ ఒక్కతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, అంతిరెడ్డి రాజారెడ్డి, జావెద్ అక్రమ్, నరాల రత్నాకర్, నగేశ్ రెడ్డి, రాజేశ్వర్‌రావు, విపుల్ గౌడ్, కోనేరు సాయికుమార్, బంగారు సా యిలు, సేవాదల్ సంతోష్, అపర్ణ, రేవతి, పోల ఉష, చాంగుబాయి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇన్‌చార్జి ఏసీపీగా మస్తాన్‌వలీ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ట్రాఫిక్ ఇన్‌చార్జి ఏసీపీగా మస్తాన్‌వలీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏసీపీ నారాయణను బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో మస్తాన్‌వలీ మహిళా పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పని చేశారు. ప్రస్తుతం సీటీసీలో ఏసీపీగా పని చేస్తుండగా ట్రాఫిక్ బాధ్యతలు కేటాయించారు. ఆయనకు ట్రాఫిక్ సీఐలు ప్రసాద్, చందర్‌రాథోడ్ నాయక్, ఎస్సైలు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పేరుకే 'అనుమతి లేదు'



డిచ్‌పల్లి: మాధవనగర్ ఆర్వోబీ నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో రైల్వే గేటు మీదుగా భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. ప్రారంభంలో బైపాస్ మీదుగా భారీ వాహనాలను మళ్లించారు. ఆ తరువాత రైల్వే అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో రైల్వే గేటు మీదుగానే భారీ వాహనాలు (ఆర్టీసీ బస్సులు మినహా) రాకపోకలు సాగిస్తున్నాయి. ఓ వైపు నిర్మాణ పనులు కొనసాగుతుండడం, తరచూ రైల్వే గేటు పడుతుండటంతో ఇరువైపులా కార్లు, జీపులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోతుంటాయి. అదే సమయంలో భారీ వాహనాలు (లారీలు, కంటెయినర్లు) రైల్వే గేటు మీదుగా వస్తుండటంతో చిన్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారులు, పోలీసులు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఆర్వోబీ వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి భారీ వాహనాల రాకపోకలను బైపాస్ మీదుగా మళ్లించాలని అంటున్నారు.

ధాన్యం అన్‌లోడింగ్‌లో జాప్యం వద్దు

- వెంటవెంటనే ధాన్యం బస్తాలను తరలించాలి
- అకాల వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాలు
- కొనుగోలు కేంద్రాల సందర్శన



బాల్కొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఆర్మూర్, బాల్కొండ : రైస్ మిల్లుల్లో ధాన్యం బస్తాల అన్‌లోడింగ్‌ను జాప్యం చేయొద్దని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని వెంటవెంటనే నిర్దేశిత మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఆర్మూర్ పట్టణం పరిధిలోని పెర్కిట్ శివారులో మెప్మా ఆధ్వర్యంలో, బాల్కొండలో, ముప్కాల్ మండలం వెంచిర్యాలలో పీఏసీఎస్, ఐకేపీ మహిళా సంఘాల ద్వారా కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ బుధవారం సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి ధాన్యం విక్రయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? అని ఆరా తీశారు. ధాన్యం ఎప్పుడు తీసుకొచ్చారు? తూకం ఎన్ని రోజులకు జరిగింది? కేంద్రాల నిర్వాహకులకు సహకరిస్తున్నారా? సదుపాయాలు కల్పిస్తున్నారా? అనే వివరాలు తెలుసుకున్నారు. ఆయా కేంద్రాల ద్వారా ఇప్పటివరకు సేకరించిన, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మిల్లర్లు ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకుని నిలువ చేసుకునేందుకు వీలుగా అందుబాటులో ఉన్న గోదాములను గుర్తించాలన్నారు. హమాలీలు, లారీల కొరత తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే 7 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని సేకరించామని తెలిపారు. రైతులు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువు లోగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఐకేపీ డీపీఎం సాయిలు, స్థానిక అధికారులు ఉన్నారు.

కళ్ల ముందుకు నాటి ఘటనలు

భారత్ - పాక్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో ప్రజల్లో విస్తృత చర్చ

- జిల్లాలో గతంలో వెలుగు చూసిన ఉగ్రవాదుల కార్యకలాపాలు
- కొత్తగా వచ్చే వారి వివరాల సేకరణను మరిచిన అధికారులు
- పాకిస్తాన్ వాళ్లు ఉంటే వెనక్కి పంపాలని సీపీని కోరిన బీజేపీ ఎమ్మెల్యేలు



ఖలీల్‌వాడి: జిల్లాలో 2000 ఏప్రిల్ 6వ తేదీన ఉగ్రవాది అజాంఘోరీని పోలీసులు మట్టుబెట్టారు. నిజామాబాద్‌లో తలదాచుకుంటూ అజాంఘోరీ ఉగ్ర కార్యకలాపాల నిమిత్తం జగిత్యాలకు వెళ్తుండగా పోలీసులు కలిసి మట్టుబెట్టారు.

- 1998లో బోధన్‌లోని ఓ సైకిల్ షాప్ యజమానిని అజాంఘోరీ అనుచరులు తొమ్మిది మంది కలిసి హత్య చేశారు. వీరిలో ఏడుగురు అరెస్ట్ కాగా, మరో ఇద్దరి ఆచూకీ ఇప్పటి వరకు లభించలేదు. ఆ ఇద్దరు హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులోని నిందితులకు సహకరించినట్లు ఎన్ఐఏ విచారణలో తేలింది.
- 2002లో సారంగాపూర్‌లోని ఎస్టీడీ బూత్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాకిస్తాన్‌లోని హైదరాబాద్‌కు చెందిన ఐఎస్ఐ ఏజెంట్ హతమయ్యాడు.
- నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారం గ్రామంలో గాంధీ విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు నల్లరంగు పూశారు. విగ్రహం మెడలో పేపర్ల దండ వేశారు. పేపర్లను పరిశీలించగా.. దేశ వ్యతిరేక నినాదాలు రాసి ఉన్నాయి. దీంతో ఒక్కసారిగా గ్రామంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.
- బోధన్ పట్టణంలోని ఒకే ఇంటి నుంచి పశ్చిమ బెంగాల్‌కు చెందిన 76 మందికి పాస్‌పోర్టులు జారీ అయిన వ్యవహారం నాలుగేళ్ల క్రితం వెలుగు చూసింది.
- 2022 జూన్‌లో నిజామాబాద్ నగరంలోని ఆటోనగర్‌లో నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా శిక్షకుడు అబ్దుల్‌ఖాదర్‌తోపాటు పలువురిని ఆరోటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణ చేపట్టిన ఎన్ఐఏ దేశవ్యాప్తంగా దాడులు చేసి పలువురిపై కేసులు నమోదు చేసింది. దీంతో కేంద్ర హోంశాఖ పీఎఫ్ఐని నిషేధించింది. ఈ వ్యవహారం నిజామాబాద్ నుంచి వెలుగులోకి వచ్చింది.

జిల్లాలో ఉగ్రవాదుల కదలికలు ప్రస్తుతానికి ఉన్నాయా? లేవా? అనేది పక్కన పెడితే.. గతంలో నిజామాబాద్ నగరంతోపాటు బోధన్ పట్టణంలో వెలుగు చూసిన ఘటనలు ఆందోళనకు గురి చేస్తుంటాయి. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఘటన, పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత్‌దాడి నేపథ్యంలో జిల్లాలో పాకిస్తానీలు, బంగ్లాదేశ్‌లోని రోహింగ్యాల అంశం మరోసారి చర్చకు దారితీసింది.

వివరాలు సేకరించని అధికారులు

జిల్లాలోకి కొత్తగా వచ్చే వారి వివరాలను సేకరించాల్సి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. అధికారులు ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేయడంతో ఏ ప్రాంతానికి ఎవరు వచ్చి వెళ్తున్నారో తెలియని పరిస్థితి ఉంది.

అక్కడి వారిని పెళ్లి చేసుకుని ఇక్కడే ఉంటున్నారు

నిజామాబాద్ నగరానికి చెందిన పలువురు యువతులు పాకిస్తానీయులను పెళ్లి చేసుకున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. పెళ్లయిన తరువాత వివిధ కారణాలతో విడాకులు తీసుకున్న వారు, భర్త మరణించడంతో పుట్టింటికి వచ్చి ఇక్కడే ఉంటున్న వారు ఇలా ఆరు నుంచి ఎనిమిది కుటుంబాలు ఉన్నట్లు నిఘా వర్గాలు గుర్తించినట్లు తెలిసింది. దీంతోపాటు కొందరు గతంలో భారత పౌరసత్వానికి దరఖాస్తు చేసుకోగా వారిపై నిఘావర్గాలు ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.

సీపీకి బీజేపీ ఎమ్మెల్యేల వినతి

జిల్లాలో పాకిస్తాన్ పౌరులు ఉంటే వారిని వెనక్కి పంపించాలని బీజేపీ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి సీపీ పోతరాజు సాయిచైతన్యకు సోమవారం వినతి పత్రం అందజేశారు. చెల్లుబాటు కాని వీసాలతో జిల్లాలో నివాసముంటున్న పాకిస్తానీయులను గుర్తించాలని కోరారు. ఉగ్రవాద సంస్థలతో పని చేసిన వ్యక్తులు గతంలో జిల్లాలో పట్టుబడిన విషయాన్ని సీపీ దృష్టికి తీసుకెళ్లారు. అనుమానిత ప్రాంతాలపై దృష్టి సారించాలని, నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకువాలని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి సైతం కలెక్టర్‌కు లేఖ అందజేశారు.

చట్ట ప్రకారం చర్యలు



పాకిస్తాన్ పౌరులు ఉంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ప్రత్యేక విభాగంతో విచారణ చేపడుతున్నాం. గతంలో జిల్లాలో వెలుగుచూసిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. పాకిస్తానీయులపై ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయి. జిల్లాలో శాంతిభద్రతలకు ఇబ్బంది లేదు.

- పోతరాజు సాయిచైతన్య, సీపీ

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

- ముందునుంచి పనిచేసినవారికే ప్రాధాన్యం
- కష్టపడితే పదవులు అవే వస్తాయి
- ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్



నాయకులు, కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

నిజామాబాద్ సిటీ : కాంగ్రెస్ నమ్ముకుని ఉన్నవారికి, పార్టీకోసం కష్టపడి పనిచేసినవారికి పదవులు వాటంతట అవే వస్తాయని, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ సూచించారు. జిల్లాకేంద్రంలోని బస్వాగార్డెన్‌లో బుధవారం కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశాన్ని నుడా చైర్మన్ కేశ వేణు అధ్యక్షతన నిర్వహించగా, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ.. విభేదాలను పక్కన పెట్టి ప్రతి ఒక్కరూ పార్టీ కోసం పని చేయాలన్నారు. బల్దియా ఎన్నికల్లో కాంగ్రెస్‌జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ నుంచి వెళ్లే నిధులను కేంద్రం ఇతర రాష్ట్రాలకు కేటాయిస్తోందని మండిపడ్డారు. తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు, సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను నమ్ముకున్నవారికే పదవుల్లో మొదటి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. 2017 కన్నా ముందు పార్టీలో ఉన్నవారికి, పార్టీని వీడనివారికే అధ్యక్ష పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచించినట్లు తెలిపారు. ఎంఐఎంతో ఇప్పటివరకు ఎలాంటి పొత్తు లేదని స్పష్టం చేశారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, అంతిరెడ్డి రాజారెడ్డి, జావేద్ అక్రమ్, నరాల రత్నాకర్, నగేశ్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, విపుల్‌గౌడ్, కోనేరు సాయికుమార్, చుక్క సాయిలు, అపర్ణ, రేవతి, చాంగుబాయి, తదితరులు పాల్గొన్నారు.

మీ ప్రాణాలను కాపాడుకోండి..

కల్తీ కల్లు తాగి ప్రాణాలను కోల్పోవద్దని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఉన్నతాధికారులు సూచించారు. కల్తీ కల్లు, గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవిస్తే కలిగే అనర్థాలను వివరిస్తూ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు.



మోపాల్ మండలం న్యాల్‌కల్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, గ్రామస్తులు

క్లుప్తంగా

విద్యుత్ పనుల్లో జాగ్రత్తలు పాటించాలి



నందిపేట్(ఆర్మూర్): విద్యుత్ పనులు చేసేటప్పుడు సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్ సూచించారు. నందిపేట మండలంలోని ఆంధ్రనగర్ గ్రామంలో బుధవారం విద్యుత్ భద్రత వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ కార్మికులకు భద్రతా సూత్రాలను వివరించారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డీఈఈ శ్రీనివాస్, ఏడీఈ అశోక్, చంద్రశేఖర్, నందిపేట, నవీపేట మాక్లూర్ మండలాల విద్యుత్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను బహిష్కరిస్తున్నాం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ రాష్ట్ర ప్రయివేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం పిలుపు మేరకు ఈ నెల 14 నుంచి తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ప్రారంభం కానున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను బహిష్కరిస్తున్నట్లు తెయూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, సంజీవ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు తెయూ వీసీ యాదగిరిరావుకు, రిజిస్ట్రార్ యాదగిరిలకు లేఖ అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల మంజూరు విషయమై పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలిపారు. అలాగే నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో కూడా పలుమార్లు చర్చలు జరిపినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ డిగ్రీ పరీక్షలను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. సంఘం ప్రతినిధులు నరాల సుధాకర్, అరుణ్, గురువేందర్, దత్తు, నవీన్, శ్రీనివాస్ రాజు, గిరి, అతీఖ్, విజయ్, గంగాధర్, నరేందర్, వెంకట్ రెడ్డి తదితరులున్నారు.

అధికారి మారినా పాత పేరే..



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో బోర్డుపై పౌర సమాచార అధికారి పేరు తప్పుగా ఉండడంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. పౌర సమాచార అధికారిగా మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి రమేశ్ మార్చిలో బాధ్యతలు చేపట్టారు. కానీ బోర్డుపై గతంలో పనిచేసిన అధికారి శ్రీకాంత్ పేరు ఉండడంతో కార్యాలయానికి వచ్చిన వారు బోర్డును చూసి అవాక్కవుతున్నారు.

పత్తాలేని జీలుగ విత్తనాలు

- ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నా విత్తనాలు తెప్పించని వ్యవసాయ శాఖ అధికారులు
- ఎదురుచూస్తున్న అన్నదాతలు



డొంకేశ్వర్(ఆర్మూర్): ఖరీఫ్ సీజన్ దగ్గరికి వచ్చినా జిల్లాకు అవసరమైన జీలుగ విత్తనాలు ఇప్పటి వరకు రాలేవు. వచ్చే నెల నుంచి వరి సాగు చేసే రైతులు జీలుగ కోసం ఎదురు చూస్తున్నారు. సరఫరా ఆలస్యమైతే సాగు కూడా వెనుకబడుతుందని చెబుతున్నారు. ఎందుకంటే విత్తనాలు చల్లిన 40 రోజులకు పెరిగిన జీలుగ మొక్కలను కలియదున్నాల్సి ఉంటుంది. ఆ తర్వాతే వరినాట్లు వేసుకోవాలి. జీలుగ చల్లడానికి ఇదే సరైన సమయమని రైతులు అంటున్నారు. ఇటు వ్యవసాయ శాఖ ఐతే ఇంకా విత్తనాలను తెప్పించే పనిలోనే ఉంది.

గతేడాది 7వేల మెట్రిక్ టన్నుల విత్తనాలు..

గతేడాది వానాకాలం సీజన్‌లో 7వేల మెట్రిక్ టన్నుల జీలుగ విత్తనాలు రైతులు కొనుగోలు చేశారు. ఈసారి 4.32లక్షల ఎకరాలకు పైనే వరి సాగవుతుందని అంచనా వేయగా, ఇందుకు 10వేల మెట్రిక్ టన్నుల జీలుగ విత్తనాలు అవసరమని వ్యవసాయ శాఖ రాష్ట్ర శాఖకు ఇండెంట్ పంపింది. వాస్తవానికి మే మొదటి వారంలోనే జిల్లాకు ఈ విత్తనాలు సరఫరా కావాలి. కానీ ఢిల్లీ నుంచి రైలు వ్యాగన్లలో తెప్పించడం ఆలస్యం అవుతోంది. జిల్లాకు రావడం, మండలాలకు తరలించడం జరిగేసరికి మరో పది పదిహేను రోజుల సమయం పట్టే పరిస్థితి కనిపిస్తోంది. ఎందుకంటే 10వేల మెట్రిక్ టన్నులలో దశల వారీగా జిల్లాకు విత్తనాలు వస్తాయి. సీడ్స్ కార్పొరేషన్ ఈ జీలుగ విత్తనాలను సొసైటీలకు సరఫరా చేయనుంది. అదే విధంగా జీలుగతో పాటు జనుము విత్తనాలు 2వేల మెట్రిక్ టన్నులు తెప్పిస్తున్నారు.


సబ్సిడీపై స్పష్టత అప్పుడే..

నేలకు, పంటకు మేలు చేసే పచ్చిరొట్ట ఎరువును తయారు చేసేందుకు ప్రభుత్వం జీలుగ విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందజేస్తూ వస్తోంది. పట్టాదారు పుస్తకం ఉన్న రైతుకు 50–70 శాతం వరకు సబ్సిడీ ఇచ్చేది. పట్టాలేని రైతులకు తక్కువ సబ్సిడీ ఉండేది. ఈ వానాకాలం ఎంత సబ్సిడీపై విత్తనాలు అందజేస్తారనే దానిపై ఇప్పటికైతే స్పష్టత లేదు. 50 శాతానికి తగ్గకుండా ఇస్తారని అధికారులు పేర్కొంటున్నారు. జీలుగ విత్తనాలు జిల్లాకు వచ్చిన తర్వాతే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సబ్సిడీ ఖరారు అవుతుందని, జిల్లాలో ఎన్ని సెంటర్లలో పంపిణీ చేస్తామనేది ప్రటకన చేస్తామని అధికారులు అంటున్నారు.

> **ఈవారంలో ఐదు వేల క్వింటాళ్లు వస్తాయి..**
>
> జిల్లాకు అవసరమైన జీలుగ విత్తనాలను తెప్పిస్తున్నాం. మొదటి విడతగా ఈ వారంలో ఐదు వేల మెట్రిక్ టన్నులు వస్తాయి. రాగానే సీడ్స్ కార్పొరేషన్ ద్వారా సొసైటీలకు సరఫరా చేయిస్తాం. మిగతా స్టాక్‌ను కూడా త్వరత్వరగా తెప్పిస్తాం. కొరత లేకుండా రైతులందరికీ పంపిణీ జరిగేలా చూస్తాం.
>
> – వీరా స్వామి, ఇంచార్జ్ జిల్లా వ్యవసాయాధికారి

సాగర్ అందాలు ఇక కనుమరుగేనా?

- నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద పర్యాటక ప్రాంతాలను పట్టించుకోని అధికారులు
- అధ్వానంగా మారుతున్న కట్టడాలు



నిజాంసాగర్ ప్రాజెక్టు



నిజాంసాగర్ ప్రాజెక్టులో బోటు షికారు (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): నిజాం నవాబు కట్టినటువంటి నిజాంసాగర్ ప్రాజెక్టు చరిత్ర రోజురోజుకు కనమరుగవుతుంది. ఆనాటి కట్టడాలు చెక్కుచెదరకుండా ఉన్నా, ఉన్నతాధికారుల పర్యవేక్ష కొరవడడంతో సరైన నిర్వహణ లేకపోవడంతో మూతపడుతున్నాయి. అప్పట్లో ఎండకాలం వచ్చిందంటే చాలు ప్రజలు ఆహ్లాదం కోసం నిజాంసాగర్ ప్రాజెక్టుకు వచ్చేవారు. ఇప్పుడు నిజాంసాగర్ ప్రాజెక్టు అందాల జాడేదీ అన్నట్లుగా మారాయి.

ప్రాజెక్టుకు ఘన చరిత్ర

నిజాంసాగర్ మండలం అచ్చంపేట, బంజపల్లి గ్రామాల పరిధిలో 1923–31లో నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మించారు. నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ ప్రధాన ఇంజినీర్ పర్యవేక్షణలో 'ఎస్' ఆకారంలో నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మితమైంది. 1405.05 అడుగులు 30 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించగా 2.75 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు, బాన్సువాడ, బోధన్, నిజామాబాద్ పట్టణాలకు తాగునీరు అందిస్తోంది. ఇంతటి ఘనమైన చరిత్ర కల్గిన నిజాంసాగర్ ప్రాజెక్టు పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది.

వేసవిలో పర్యాటక ప్రాంతం..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహరాష్ట్ర ప్రాంతాల నుంచి వందలాది మంది పర్యాటకులు నిజాంసాగర్ ప్రాజెక్టుకు తరలివస్తారు. ముఖ్యంగా వేసవి కాలంలో విహారయాత్ర కోసం నిజాంసాగర్ ప్రాజెక్టుకు పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పర్యాటకుల కోసం నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువన సమ్మర్ బాగ్‌తో పాటు స్విమ్మింగ్ పూల్, వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన పర్యాటకులు సమ్మర్ బాగ్‌కు వెళ్లి సమ్మర్‌లో లభించే అన్ని రకాల పండ్లు, కాయల రుచిచూసేవారు. అంతేకాకుండా స్విమ్మింగ్ పూల్‌లో చిన్నారులు స్విమ్మింగ్ చేయడం, వాటర్ ఫౌంటెయిన్ వద్ద సరదాగా సమయం గడిపేవారు. అయితే ప్రస్తుతం సమ్మర్ బాగ్‌లో పండ్ల రకాల చెట్లు అంతరించిపోవడంతో సమ్మర్ బాగ్ పేరు కనుమరుగయింది. అలాగే స్విమ్మింగ్ పూల్, వాటర్ ఫౌంటెన్ ఉన్నా వాటికి నీటి సరఫరా లేకపోవడంతో దశబ్దాల కాలం నుంచి అవి మూలనపడ్డాయి. పర్యాటకులకు ఇక్కడ బోటు షికారు అప్పట్లో అందుబాటులో ఉండేది. జిల్లా అధికారుల అనుమతితో ఇక్కడ బోటు షికారు చేయించేవారు. అయితే కాలక్రమేనా ప్రాజెక్టు వద్ద బోటు షికారు సైతం కనుమరుగైంది. దీంతో పర్యాటకులు సాగర్ అందాలను ఆస్వాదించ లేకపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రాజెక్టు వద్ద చారిత్రక కట్టడాలను వినియోగంలోకి తీసుకువచ్చి, సందర్శకులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నీళ్లు లేని ఫౌంటెయిన్



నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద ఉన్న ఛత్రీ బంగ్లా

ఫెయిల్యూర్ సీఎంగా రేవంత్‌రెడ్డికి ఫస్ట్‌ప్రైజ్



కోనసముందర్‌లో గిడ్డంగి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, తదితరులు

- ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

కమ్మర్‌పల్లి: అందాల పోటీలు కాదు.. ఫెయిల్యూర్ సీఎంల పోటీలు పెడితే దేశంలో నంబర్ వన్ ర్యాంక్ రేవంత్‌రెడ్డికి రావడం ఖాయమని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. కమ్మర్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఆయన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి వడ్ల కొనుగోలు చేయడంపై కంటే అందాల పోటీలపై రివ్యూ చేయడంపైనే దృష్టిపెడుతున్నారన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలంటే నన్ను కోసుకొని తినుమంటున్న రేవంత్ ముఖ్యమంత్రిగా అనర్హుడని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 17 నెలల్లో రూ. 1లక్ష 60 వేల కోట్లు అప్పు చేసి, ఒక్క అభివృద్ధి పని చేశారా అని ప్రశ్నించారు. అప్పుల విషయంలో తప్పుడు లెక్కలతో కేసీఆర్ పాలనపై రేవంత్ రెడ్డి నిందలు వేస్తుడన్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వడం లేదన్నారు. డీసీవో శ్రీనివాస్‌రావు, చైర్మన్‌లు దేవేందర్, బాపురెడ్డి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిరోధానికి కృషి చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పాల్గొన్న సీపీ సాయిచైతన్య

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సాయిచైతన్య
- కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం

నిజామాబాద్ అర్బన్: గంజాయి, క్లోరోఫామ్, అల్ప్రాజోలం వంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. మత్తు పదార్థాల రవాణాపై నిరంతరం నిఘాను కొనసాగించాలని, ఎలాంటి సమాచారం తెలిసినా పరస్పరం పంచుకుంటూ వీటి నిరోధానికి పకడ్బందీ కార్యాచరణతో ముందుకెళ్లాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమన్వయ సమావేశం జరిగింది. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి సీపీ సాయి చైతన్య అధికారులకు పలు సూచనలు చేశారు. యువత ముఖ్యంగా విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా అన్ని విద్యాసంస్థలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు అలవాటుపడితే వారిని డీఅడిక్షన్ సెంటర్లో చేర్పించి, ఆ అలవాటును మానుకునేలా చూడాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ, ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి వివిధ మార్గాల ద్వారా గుట్టుగా ఇక్కడికి తరలిస్తున్నారని అన్నారు. ఎక్కువగా రైలు మార్గం ద్వారా రవాణా చేసే అవకాశాలు ఉన్నందున రైల్వే అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని, తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని అన్నారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలం నిల్వల గురించి ఆరా తీసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలీస్, ఎక్సైజ్, రవాణా తదితర శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. నగర మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీఐఈవో రవికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో మార్పు మొదలైనట్టేనా?

- కలెక్టర్‌కు సమస్యలు విన్నవించిన మెడికోలు, వైద్యులు
- కిచెన్, డైనింగ్ హాల్‌కు కొనసాగుతున్న మరమ్మతులు



జీజీహెచ్ డైనింగ్‌హాలులో చేపట్టిన మరమ్మతులు

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మార్పు మొదలైనట్టేనా..? అంటే ప్రస్తుత పరిస్థితులను చూస్తే అవుననే సమాధానం లభిస్తుంది. నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ జీజీహెచ్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎటువంటి హడావుడి లేకుండా తనపని తాను చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారు. అయితే ఇటీవల కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు జీజీహెచ్‌ను తనిఖీ చేసిన సమయంలో మెడికల్ కళాశాల పీజీ విద్యార్థులు కిచెన్, డైనింగ్ హాల్ దుస్థితిని వివరించారు. అపరిశుభ్ర వాతావరణం ఉంటోందని, తాము భోజనం చేసే సమయంలోనే ఎలుకలు అటూఇటూ తిరుగుతున్నాయని తెలిపారు. సరైన సౌకర్యాలు లేవని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ వెంటనే మరమ్మతులు చేయించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. దీంతో ఆస్పత్రి అభివృద్ధి నిధులు రూ.10లక్షలతో కిచెన్, డైనింగ్ సెక్షన్‌లలో మరమ్మతులను ప్రారంభించారు. భోజనాలు చేసేందుకు ప్రత్యేకంగా క్యాబిన్‌ను సైతం ఏర్పాటు చేయనున్నారు. మరమ్మతులు ప్రారంభం కావడంతో వైద్యులు, పీజీ విద్యార్థులు కలెక్టర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

> **రూపురేఖలు మారుస్తున్నాం**
>
> 
>
> కలెక్టర్ అనుమతితో డైనింగ్ సెక్షన్ రూపురేఖలు మారుస్తున్నాం. రూ. 10లక్షలతో మరమ్మతులు చేపడుతున్నాం. ఇప్పటికే గోడలకు రంగులు వేయించాం. ప్రత్యేకంగా క్యాబిన్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. డైనింగ్ సెంటర్, కిచెన్ అందంగా ముస్తాబుకానున్నాయి.
>
> – డాక్టర్ శ్రీనివాస్, జీజీహెచ్ సూపరింటెండెంట్

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు

దోమకొండ/తాడ్వాయి/బీబీపేట: పలు మండలాల్లో రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. దోమకొండ రైతు వేదికలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు సంబంధించిన నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారి మణిదీపిక తెలిపారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ నంబరు అందజేయాల్సి ఉంటుందన్నారు. మొబైల్ నంబర్‌కు ఓటీపీ రావడంతో వివరాలను వ్యవసాయ విస్తీర్ణాధికారికి అందించినట్లయితే 11 అంకెలతో కూడినటువంటి రైతు విశిష్ట సంఖ్య అందజేయబడుతుందన్నారు. బీబీపేట మండలం యడారం క్లస్టర్ లో రైతులకు 11 సంఖ్యలతో కూడిన యూనిక్ కోడ్ ను నమోదు చేసినట్లు యాడారం ఏఈవో సంతోష్ తెలిపారు. తాడ్వాయి రైతు వేదిక కార్యాలయంలో రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం కొనసాగిందని అధికారులు తెలిపారు.

చిన్న పోతంగల్‌లో దొంగల హల్‌చల్



గాంధారి: మండలంలోని చిన్న పోతంగల్ గ్రామంలో మంగళవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కొర్రి గౌరవ్వ రాత్రి ఆరుబయట నిద్రించగా వర్షం రావడంతో ఇంట్లోకి వెళ్లింది. కానీ తలుపులకు గడియ వేయడం మరిచిపోయింది. ఇదే అదనుగా ఇద్దరు దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఆమెను కత్తితో బెదిరించారు. నగదు, 12 తులాల వెండి, గౌరవ్వ మెడలో నుంచి బంగారు గుండ్లు లాక్కుని పరారయ్యారు. మరో కాలనీలో ఉండే కుమ్మరి రోజా ఇంటికి తాళం వేసి అదే గ్రామంలోని తన తల్లిగారింటికి వెళ్లింది. ఉదయం ఆమె ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు సమాచారం ఇచ్చారు. ఇంట్లో దాచిన ఏడున్నర మాసాల బంగారం, 12 తులాల వెండి, కొంతనగదు చోరీకి గురైనట్లు రోజా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలాన్ని సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, గాంధారి ఎస్సై ఆంజనేయులు పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కశ్మీర్‌లో యువ జవాన్ వీరమరణం



వనంజే సచిన్(ఫైల్)

మద్నూర్(జుక్కల్): మండలానికి సరిహద్దులోని దెగ్లూర్ తాలుకాలోని తమ్లూర్ గ్రామానికి చెందిన వనంజే సచిన్(29) అనే యువ జవాన్ మంగళవారం కశ్మీర్‌లో వీరమరణం పొందినట్లు గ్రామస్తులు తెలిపారు. తమ్లూర్ గ్రామానికి చెందిన వనంజే యాదవ్ కుమారుడు సచిన్‌కు 2017లో సియాచిన్‌లో మొదటి పోస్టింగ్ రాగా, ప్రస్తుతం కశ్మీర్‌లో విధులు నిర్వహించేవాడు. ఈక్రమంలో మంగళవారం సచిన్ వీరమరణం పొందినట్లు సమాచారం అందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మద్నూర్‌లో ఈ సమాచారం అందడంతో ప్రతి ఒక్కరు సచిన్ ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

ప్రమాదవశాత్తు బాలుడి మృతి

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లిలోగల ఇటుక బట్టీ వద్ద ఓ బాలుడు ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. ఒడిశా రాష్ట్రానికి చెందిన నిత్య నిరంజన్, మందాకిని దర్వా దంపతులు కొన్ని నెలల క్రితం ఉపాధి నిమిత్తం ముదక్‌పల్లిలోని ఇటుక బట్టీకి వచ్చారు. వారు స్థానికంగా రేకుల గుడిసె వేసుకొని నివాసముంటున్నారు. బుధవారం ఉదయం సుడిగాలి రావడంతో రేకుల గుడిసెపై ఉన్న బండరాళ్లు గుడిసెలో ఉన్న వారి కుమారుడు అభినప్ దర్వా (5)పై పడ్డాయి. దీంతో అతడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వెంటనే నిజామాబాద్‌లోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

అంత్యక్రియలకు వెళ్లి.. అనంతలోకాలకు..

- గోదావరిలో పడి ఒకరి మృతి



మారంపల్లి గంగాధర్(ఫైల్)

నవీపేట: బంధువు అంత్యక్రియలు పూర్తయ్యాక గోదావరి నదిలో స్నానానికి వెళ్లి మరో బంధువు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్‌లోని అంబేడ్కర్ కాలనీకి చెందిన మారంపల్లి గంగాధర్(45) మండలంలోని యంచ గ్రామానికి చెందిన దగ్గరి బంధువు సాయమ్మ అంత్యక్రియలకు మంగళవారం వచ్చాడు. గోదావరి నది ఒడ్డున దహన సంస్కారాలు పూర్తయ్యాక, అతడు నదిలో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నదిలో పడి మృతి చెందాడు. బుధవారం ఉదయం గంగాధర్ మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య సాయిలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీటు కోసం గొడవ.. ఆగిన బస్సు



లింగంపేట(ఎల్లారెడ్డి): బస్సులో సీటు కోసం గొడవ జరిగిన ఘటన లింగంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. లింగంపేట బస్టాండ్‌లో బుధవారం ఎల్లారెడ్డి వైపు వెళ్తున్న బస్సులో పలువురు మహిళలు ఎక్కారు. బస్సు ఎల్లారెడ్డి వైపు బయలుదేరగా సీటు కోసం పలువురు మహిళలు గొడవ పడ్డారు. మాటా మాటా పెరిగి ఒకరినొకరు కొట్టుకున్నారు. దీంతో డ్రైవర్ బస్సును లింగంపేట అంబేడ్కర్ చౌరస్తా దాటిన తర్వాత నిలిపివేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చెరుకొని మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇరువర్గాల వారికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి పంపినట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి శవమయ్యాడు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గత నెలలో అదృశ్యమైన ఓ వ్యక్తి, శవమై కనిపించాడు. ఎస్సై రాజయ్య తెలిపిన వివరాలు ఇలా.. తాడ్వాయి మండలం నందివాడ గ్రామ శివారులోని వ్యవసాయ బావివద్ద కుళ్లిపోయిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం బుధవారం స్థానికులకు కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రాజయ్య, సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఓ మిస్సింగ్ కేసుకు సంబంధించి కుటుంబసభ్యులను రప్పించారు. వారు మృతదేహాన్ని గుర్తించి, కామారెడ్డి మండలంలోని లింగాపూర్‌కు చెందిన గన్‌సింగ్(45)గా గుర్తించారు. గన్‌సింగ్ గతనెల 13న తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో ఉన్న తమ బంధువుల ఇంటికి వచ్చాడు. కాగా మతిస్థిమితం సరిగా లేని అతడు వచ్చిన రోజే మధ్యాహ్నం ఇంటినుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య ఫిర్యాదు మేరకు తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈక్రమంలో అతడు మృతిచెంది కనిపించగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో కుక్కల దాడిలో ఎనిమిది గొర్రెలు, ఒక మేక మృత్యువాత పడ్డాయి. గ్రామంలోని దొడ్ల నవీన్‌కు చెందిన గొర్రెలు, మేకల మందపై బుధవారం వేకువజామున కుక్కలు దాడిచేయడంతో ఎనిమిది గొర్రెలు, ఒక మేక మృతి చెందింది. ఈవిషయమై బాధితుడు వెంటనే ఆర్ఐ బాలయ్యకు సమాచారం అందించగా ఘటన స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు. సుమారు రూ.70వేల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

విద్యుత్‌షాక్‌తో మేకలు..



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని శివాపూర్ గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి రెండు మేకలు మృతి చెందినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. గ్రామంలోని చింతల శివరాములుకు చెందిన మేకలు మేత కోసం వెళ్లగా గ్రామ శివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో మృతి చెందాయని వారు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నష్ట పరిహారం అందేలా చర్యలను తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

పొల్కంపేట్‌లో గేదె..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన జోగాయుల మహేష్ గౌడ్‌కు చెందిన పాడిగేదె బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం మేతకు వెళ్లిన గేదె గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రం వద్ద మేత మేస్తుండగా విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్టు వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. గేదె విలువ రూ. 60వేలు ఉంటుందని, అధికారులు స్పందించి నష్ట పరిహారం అందించాలని బాధితుడు కోరాడు.